నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్‌లోని అభయాంజనేయ స్వామి సహిత శ్రీ రాజరాజేశ్వరి నాగలింగేశ్వర ఆలయం దశమ బ్రహ్మోత్సవాలు ఈనెల 10 నుంచి 4 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. 10న ఉదయం 9 గంటలకు మంగళ వాయిద్యాలు, గోపూజ, విఘ్నేశ్వర పూజ, పుణ్యహచనం, దేవతా ఆహ్వానం, సాయంత్రం 5 గంటలకు అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, అవాహిత దేవతా పూజ, ఆంజనేయ మూలమంత్ర ప్రవచనాలు, 11న ఉదయం 9 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం, నూతన శిఖర కలశ సంప్రోక్షణ, సాయంత్రం 6 గంటలకు స్వామివారి ఎదుర్కొలు, 12న ఉదయం 9 గంటలకు మహాపూర్ణాహుతి, 11 గంటలకు శ్రీనాగలింగేశ్వరి రాజరాజేశ్వరి దేవతా కల్యాణం, మధ్యాహ్నం అన్నవితరణ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి కోరారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పాల్గొన్న భక్తులు

నిజాంపేట్: ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2, 12వ డివిజన్‌లో పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం 8:30 గంటలకు గోపూజ, గణపతిపూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 3 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి తెలిపారు.

ఎక్సైజ్ పోలీసుల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

దుండిగల్: ఇటీవల గంజాయి అక్రమ సరఫరా జరుగుతున్న నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా దుండిగల్‌లోని జ్యోతిరావు పూలే స్టేడియం, గండిమైసమ్మ చౌరస్తా, బహదూర్‌పల్లి ప్రాంతాలతో పాటు నిర్మానుష్య ప్రాంతాల్లో నిలిపి ఉన్న వాహనాలను శుక్రవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎక్సైజ్ సీఐ యాదయ్య, ఎస్సై రవి సిబ్బంది తదితరులు ఉన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



తాగునీరు అందిస్తున్న డీసీపీ సురేశ్‌కుమార్

నిజాంపేట్: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని బాలానగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సురేశ్ కుమార్ అన్నారు. బాచుపల్లి పోలీసుల ఆధ్వర్యంలో బాచుపల్లిలోని మల్లంపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ టి.శ్రీనివాస్‌రావు, బాచుపల్లి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలేజీల మెస్‌లను హాస్టల్స్‌గా మార్చాలని వినతి

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల మెస్‌లను స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్స్‌గా మార్చాలని కోరుతూ స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ వెంకటేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు చంద్రశేఖర్, అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల మెస్‌లను ప్రైవేట్ ఏజెన్సీలు నడిపిస్తున్నాయని, వారం రోజులుగా విశ్వ విద్యాలయ మెస్‌ల టెండర్ల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, పలు వార్తా పత్రికల్లో కథనాలు వస్తున్నాయన్నారు. దీని కారణంగా విశ్వ విద్యాలయ ప్రతిష్ఠ దెబ్బతినే ఆస్కారం ఉందన్నారు. గతేడాది నుంచి అనేకసార్లు ప్రైవేట్ ఏజెన్సీలు నడిపిస్తున్న మెస్‌ల్లో ఆహారం కల్తీ అయినా ఘటనలు జరిగాయన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరం నుంచి జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలలు అయిన జగిత్యాల, సుల్తాన్‌పూర్, మంథని, వనపర్తి, మహబూబాబాద్, పాలేరు, సిరిసిల్ల అన్ని కళాశాల మెస్‌లను స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్స్‌గా కన్వర్ట్ చేయాలని కోరారు.

నిఘా నీడలో..

- కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం
- 8 చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు
- గతంలో అధికారులపై వరుస దాడులు
- జోరుగా దళారుల దందా
- సీసీ కెమెరాల పర్యవేక్షణతో చెక్







కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం

సుభాష్‌నగర్: గాజులరామారంలోని కుత్బుల్లాపూర్ తహసీల్ కార్యాలయం నిఘా నీడలోకి వెళ్లింది. అధికారులపై తరచూ దాడులు, మరోవైపు దళారులకు చెక్ పెట్టేందుకు అధికారులు 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. గ్రేటర్‌లోని కుత్బుల్లాపూర్ తహసీల్ కార్యాలయంలో రెండు సర్కిళ్లకు గాను 8 డివిజన్లు ఉన్నాయి. ఇక్కడ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల వారు సైతం నివసిస్తూ ఉండడంతో కుత్బుల్లాపూర్ మినీ ఇండియాగా మారిందని చెప్పుకోవచ్చు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ జనాభా ఇక్కడ నివసిస్తుంటారు. ఇందులో 70 శాతం స్లమ్ ఏరియాల్లోనే ఉంటున్నారు. అదే స్థాయిలో రోజువారీగా వివిధ పనుల కోసం కుత్బుల్లాపూర్ తహసీల్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో జనాలు వస్తుంటారు. అయితే చాలామంది నిరక్షరాస్యులు కాగా సరైన అవగాహన లేక అధికారులతో వాగ్వాదానికి దిగడం, దాడులు చేయడం పరిపాటిగా మారింది. గతంలో పని చేసిన పలువురు తహసీల్దార్లపై కూడా దాడులు జరిగాయి. దీనికి తోడు కార్యాలయం బయట దళారులు దందా సాగిస్తున్నారు. అంతే గాకుండా కార్యాలయ ఆవరణలో పార్కింగ్ చేసిన వాహనాల్లోని వస్తువులు చోరీకి గురయ్యాయి. వీటిని అరికట్టేందుకు సంబంధిత అధికారులు సీసీ కెమెరాలు అందుబాటులోకి తెచ్చారు.



కార్యాలయంలో అమర్చిన సీసీ కెమెరా

పలుమార్లు దాడులు..

1992లో షాపూర్‌నగర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్ కార్యాలయంలోకి నలుగురు నక్సలైట్లు సైకిళ్ల పై వచ్చి బాంబు విసిరారు. అయితే అదృష్టవశాత్తు స్వల్పంగా పేలడంతో ఫర్నిచర్ ధ్వంసమై డాక్యుమెంట్లు చెల్లాచెదురు అయ్యాయి. అప్పటి తహసీల్దార్ పాండురంగారావు ఆ సమయంలో లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు.

- తహసీల్దార్ గౌరీ వత్సల ఉన్న సమయంలో సర్వే నంబర్ 79 లోని కొంతమంది కబ్జారాయులు కలెక్టర్‌తో పాటు ఆమెపై దాడి చేశారు. అప్పట్లో కొన్ని రోజులపాటు కార్యాలయ ఆవరణలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.
- సూరారంలో తహసీల్దార్ మైపాల్ రెడ్డి ఉన్నప్పుడు ఏకంగా 30 మంది దుర్భాషలాడుతూ దాడి చేసేందుకు ప్రయత్నించారు. అప్పట్లో కొంతమంది పై కేసు నమోదు చేయడం జరిగింది.
- గాజులరామారంలోని ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాలను 2013లో పెద్ద ఎత్తున కూల్చివేయగా కోపోద్రిక్తులైన స్థానికులు పెద్ద ఎత్తున కార్యాలయం పై రాళ్లు విసురుతూ అధికారులపై దాడికి ప్రయత్నించారు. దీంతో తహసీల్దార్ ఇతర సిబ్బంది పరుగులు పెట్టారు.
- ఇలా పదుల సంఖ్యల్లో దాడులు చేసిన వారిని గుర్తించేందుకు అప్పుడు సీసీ కెమెరాలు లేకపోవడంతో చాలామంది తప్పించుకున్నారు.

దళారులకు చెక్

కొందరు అమాయకులను బుట్టలో వేసుకొని అధికారి వద్ద పనిచేసే పెడతామని పెద్ద మొత్తంలో డబ్బులు గుంజుతున్నారు. ఇప్పుడు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఏర్పాటుతో దళారుల దందాకు చెక్ పడినట్లయ్యింది.

ఇక ఆటలు సాగవు..



వివిధ పనుల కోసం కార్యాలయానికి జనాలు నిత్యం పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారి కదలికలు గమనించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. భద్రతతో పాటు, దళారులకు సైతం భయం ఉండేలా మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.

– మల్లికార్జున్ రావు, డిప్యూటీ తహసీల్దార్

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో గండిమైసమ్మ పొదుపు సంఘానికి రూ.20 లక్షలు, సరోజిని మహిళా పొదుపు సంఘానికి రూ.18 లక్షలు, తిరుపతి పొదుపు సంఘానికి రూ.17 లక్షల చొప్పున మంజూరైన రుణ పత్రాలను శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అభివృద్ధి చెందితే వారి కుటుంబంతో పాటు దేశం సైతం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కుంట సిద్ధిరాములు, పొదుపు సంఘాల సభ్యులు పద్మ, అపర్ణ, దుర్గా దేవి, అంజలి, అన్నపూర్ణ, ఆండాలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు..

చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, సూరారం డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, శ్రీ వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు వరద రాజు, శ్రీశైలం యాదవ్, నరేశ్, రాము ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాలకు రుణ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

పార్కులు అభివృద్ధి చేయండి

జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లోని రోడ్డు నంబర్ 2, 5 లలో పార్కుల అభివృద్ధి చేయాలని కోరుతూ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీగణేశ్‌తో ఫోన్లో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఇళ్లు కూల్చిన నిందితుల బైండోవర్

హైకోర్టు ఆదేశాలతో కదిలిన పోలీసులు

జగద్గిరిగుట్ట: నిరుపేదల ఇళ్లను అక్రమంగా కూల్చివేసిన నిందితులపై పోలీసులు ఎట్టకేలకు చర్యలు తీసుకున్నారు. జగద్గిరగుట్ట స్టేషన్ పరిధిలోని శంషీగూడ గ్రామంలోని సర్వే నెం.57 ప్రాంతంలో (ఫోర్ట్ ఎస్టేట్ కాలనీలో) 25 ఏళ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్లను కొంత మంది దుండగులు కూల్చివేశారు. దీంతో బాధితులు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో శంషీగూడ ప్రాంతంలో అనేక ఇళ్లను అక్రమంగా కూల్చడంలో ప్రధాన పాత్ర పోషించిన పి. వెంకటేశ్వరరావు, వెంకట్ అనే ఇద్దరిని శుక్రవారం జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ ఆధ్వర్యంలో బాలానగర్ డీసీపీ కార్యాలయంలో బైండోవర్ చేశారు. ఇక నుంచి ఎలాంటి వివాదాలు, గొడవలకు పాల్పడవద్దని డీసీపీ సురేశ్ కుమార్ వారిని హెచ్చరించారు. పోలీసులకు ఎప్పుడూ అందుబాటులో ఉండి సమాచారం ఇవ్వాలని సూచించారు. కాగా వీరిపై ఇప్పటికే జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నాయి.

విధుల సమయంలో ఒత్తిడికి గురి కావద్దు

కుత్బుల్లాపూర్: విధుల సమయంలో ఒత్తిడికి గురి కావద్దని ఫిట్‌నెస్ ట్రైనర్ పవన్ సూచించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ నరసింహ ఆధ్వర్యంలో కిందిస్థాయి ఉద్యోగులకు 'ఒత్తిడిని ఎలా జయించాలి' అనే విషయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఉద్యోగం చేసే సమయంలో పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని ప్రతిరోజు ఉదయం నిద్ర లేవగానే నీళ్ల తాగాలని, నడక, టిఫిన్ తీసుకుంటూ చిన్న చిన్న టిప్స్ పాటించాలని సూచించారు. అన్నం తిన్న ఎలాంటి గ్యాస్ట్రబుల్ పానీయాలు తీసుకోవద్దని కోరారు. గుండె జబ్బు, థైరాయిడ్, షుగర్ వంటి వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వచ్చినా వాటిని ఎలా కంట్రోల్లో ఉంచాలి అనే విషయంపై ఉద్యోగులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. అలాగే క్విట్ ఇండియా లో భాగంగా జూన్ 21న నిర్వహించే కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న ఫిట్‌నెస్ ట్రైనర్ పవన్

రైతులకు ఇబ్బందులు కలగనివ్వొద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

శామీర్‌పేట్: ధాన్యాన్ని కొనుగోల కేంద్రాలకు తరలించే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ హరిప్రియ అన్నారు. శుక్రవారం ఆమె శామీర్‌పేట మండలంలోని అలియాబాద్, శామీర్‌పేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడి, తాలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించి సహకరించాలని రైతులకు సూచించారు. ధాన్యాన్ని అమ్మిన 48 గంటల్లో నేరుగా రైతు ఖాతాలోకి నగదు జమ చేస్తామన్నారు. కేంద్రాలకు వచ్చిన రైతులకు తాగు నీరు ఏర్పాటు చేయాలని, హమాలీల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సెంటర్ ఇన్‌చార్జ్‌లను అదనపు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ సుగుణబాయి. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

9 ఏళ్ల తర్వాత అందుబాటులోకి..



జీడిమెట్ల ఫేజ్-3లోని టాయిలెట్లు

జీడిమెట్ల: ఐలా, జీఎన్ఎంఐఎస్ఎస్, టీజీఐఐసీ చొరవతో జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో టాయిలెట్లు ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఐలా, టీజీఐఐసీ వారు 2016లో జీడిమెట్లలో ప్రజల సౌకర్యార్థం ఇండస్ట్రీయల్ ఏరియాల్లోని 3 ప్రాంతాల్లో అన్ని వసతులతో అధునాతన టాయిలెట్లు నిర్మించారు. అయితే తర్వాత నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో కొన్ని నెలలకే మూతపడ్డాయి. 9 ఏళ్లుగా మూతపడి ఉన్న టాయిలెట్లను అందుబాటులోకి తెచ్చేందుకు జీడిమెట్ల మున్సిపల్ వారు పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ సంస్థకు నిర్వాహణ బాధ్యతలు అప్పజెప్పారు. సదరు సంస్థ టాయిలెట్లకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో కార్మికులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

ఓల్డ్‌బోయిన్‌పల్లి: బోయిన్‌పల్లి డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ పేర్కొన్నారు. మండులబస్తీ శ్మశాన వాటికలో పలు అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రూ. 50 లక్షల నిధులతో పనులు చేపట్టామని నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, సీనియర్ నాయకులు గడ్డం నర్సింగరావు, బుర్రి యాదగిరి, దేవేందర్, రాజు, మండుల బస్తీ కమిటీ సభ్యులు శ్రీధర్, శ్రీనివాస్, కమల, రాజ శేఖర్, గణేశ్, రవీందర్, జగన్నాథం, రఘు, మహేశ్, మధు, మోహన్, ప్రవీణ్, రాజేందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: మయూరినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ గోకరాజు రంగరాజు ఫీడర్‌లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు గోకరాజు కాలేజ్‌రోడ్డు. 11 కేవీ రామ్ నరేశ్ కేబుల్ ఫీడర్‌లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు రామ్ నరేశ్‌నగర్, హైదర్‌నగర్ గ్రామం, వెర్టెక్స్ అపార్ట్‌మెంట్స్, శ్రీనివాస అపార్ట్‌మెంట్స్. 11 కేవీ ప్రశాంత్‌నగర్ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి 11 వరకు మయూరినగర్, ఆలయ సముదాయం, ఆర్ఎస్ సిటీ రోడ్, వృద్ధాశ్రమం, ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2. 11 కేవీ మయూరినగర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మయూరినగర్, ఎస్‌బీఐ రోడ్, వృద్ధాశ్రమం ప్రాంతాలు.

వికాస్ సబ్‌స్టేషన్ పరిధిలో..

వికాస్ సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ రెడ్డి కాలనీ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు బీకే ఎన్‌క్లేవ్, రెడ్డి కాలనీ, సాయినగర్. 11కేవీ కేంద్రీయ విహార్ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కేంద్రీయ విహార్, రత్నదీప్ వెనుక వైపు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లక్ష్మీనగర్, కేంద్రీయ విహార్ రోడ్, మయూరి నగర్, రత్నదీప్ వెనుక భాగం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

11కేవీ బాలయ్యనగర్ ఫీడర్ పరిధిలో..

సుభాష్‌నగర్: ఫీడర్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గాజులరామారం సెక్షన్ ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మహదేవపురం వార్డు కార్యాలయం, బాలయ్యనగర్, 11 కేవీ కైలాస్‌హిల్స్ ఫీడర్ పరిధిలో షిర్డీహిల్స్, కైలాస్ హిల్స్, ప్రాగా టూల్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండని ఏఈ పేర్కొన్నారు.

కుత్బుల్లాపూర్: ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేట్‌బషీరాబాద్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ సెయింట్ ఆన్స్ స్కూల్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 వరకు సెయింట్ ఆన్స్ స్కూల్, రెనోవా ఆస్పత్రి, ఎన్‌సీఎల్ కాలనీ, శ్రీని ఎవెన్యూ గేట్–3. 11కేవీ రామరాజునగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు రామరాజునగర్, మైఫ్రెండ్స్ సర్కిల్ హోటల్, ఆల్వాల్ రోడ్డు, 11కేవీ బజరంగ్ హిల్స్ ఫీడర్ పరిధిలో సుచిత్ర మెయిన్ రోడ్డు, బజరంగ్ హిల్స్ ఏరియా ప్రాంతాలు.

కొంపల్లి సెక్షన్ పరిధిలో..

11కేవీ కేకే సొసైటీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 వరకు రామిరెడ్డినగర్, రెవెన్యూ ప్లాస్టిక్స్, మహదేవ వెయిట్ మెషిన్, 11 కేవీ అపర్ణ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు సెంట్రల్ పార్కు, అపర్ణ వెంచర్స్, మికాసా విల్లాస్, రాజధాని దాబా రోడ్డు, 11 కేవీ ధోలారీధనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పోచమ్మగడ్డ, సాయికృపా అపార్ట్‌మెంట్స్, శ్రీకాంత్‌రెడ్డి గోదాంలు, వెంకటరెడ్డి గోదాంలు, 11 కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో జయభేరి నందక ఆస్పత్రి, సురక్ష ఆస్పత్రి లేన్, కొంపల్లి మున్సిపల్ కార్యాలయం. 11 కేవీ జయభేరి ఫీడర్ పరిధిలో అశ్విని కాలనీ, జయభేరి బ్యాంక్‌కాలనీ, 11కేవీ నూజివీడు సీడ్స్ ఫీడర్ పరిధిలో జయభేరి శివాలయం రోడ్డు, శ్రీనివాసా కాలనీ, 11కేవీ వెన్‌సాయి ఫీడర్ పరిధిలో వెన్‌సాయి, న్యూమార్క్ రెసిడెన్సీ, శిఖర నివాస్, ఆర్‌కే కేఫ్, దత్తా అపార్ట్‌మెంట్స్, రాయల్ మిడోస్, 11కేవీ విగ్నేశ్వర ఫీడర్ పరిధిలో కేవీఆర్ గార్డెన్ రోడ్డు, జయభేరి శివాలయం రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ శ్రీనివాసులు కోరారు.

రేపు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



సుభాష్‌నగర్: గాజులరామారం మెట్‌కానిగూడలోని శ్రీనల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రేపు నరసింహ జయంతిని పురస్కరించుకుని స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 6 గంటలకు అభిషేకం, అర్చనలు, ఉదయం 11.10 గంటలకు కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నవితరణ, సాయంత్రం 5 గంటలకు స్వామి వారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

కుత్బుల్లాపూర్: ఈనెల 11న సూరారం డివిజన్ పరిధిలోని నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 5 గంటలకు స్వామివారి ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు స్వామివారి అభిషేకంతో అర్చనలు ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ ప్రతినిధి ఇంద్రసేనా గుప్తా తెలిపారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పలువురు ప్రతినిధులను శుక్రవారం కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



శ్రీవాణి

జీడిమెట్ల: జీడిమెట్ల ఐలా మున్సిపల్ కమిషనర్‌గా కె.ఏ.శ్రీవాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన నజీర్‌భాషా బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీవాణి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశ్రామిక ప్రాంతంలోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నిజాంపేట్ : కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల మార్చి నెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లోని నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గత ఏప్రిల్ 28న పెండింగ్ వేతనాలపై మున్సిపల్ కార్యాలయం వద్ద మహా ధర్నా చేపట్టగా కమిషనర్ ప్రమేయంతో మేనేజర్ పవన్ కుమార్ ధర్నాను ఉద్దేశించి మే 2 లోగా మార్చి, ఏప్రిల్ వేతనాలు చెల్లిస్తామని వాగ్దానం చేశారన్నారు. అనంతరం మేనేజర్‌తో చర్చించగా ట్రెజరీకి పంపిన మార్చి నెల చెక్కు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అప్రూవల్ అయిన తర్వాతే వేతనం వస్తుందని చెబుతున్నారని తెలిపారు. పెండింగ్ వేతనాలు విషయమై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్మికులందరూ ఐక్యమై పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నాగశేషు, చిన్న నరసింహ, మహిపాల్, నాగయ్య, నరసింహ, శీను, అలివేలు, మనీ, లక్ష్మి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

వృద్ధ కార్మికురాలికి చేయూత

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్ కంపెనీలో 20 ఏళ్లుగా హౌస్ కీపింగ్ ఉద్యోగిగా పని చేసిన నాగమణి (75)ని ఇటీవల వయోభారం కారణంగా ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ విషయాన్ని ఆమె కుమారులు కార్మిక నేత ముద్దాపురం మదన్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సంస్థ మేనేజ్‌మెంట్‌తో చర్చించి ఆమెకు న్యాయం జరిగేలా కృషి చేశారు. ఈ క్రమంలో కంపెనీ ఆమెకు నెలవారీగా రూ. 2500 పింఛన్ రూపంలో అందించేందుకు అంగీకరించగా, ఉద్యోగం నుంచి తొలగించినందుకు నష్టపరిహారంగా రూ. 2 లక్షలు ఆమెకు ఇచ్చేలా ఒప్పించారు. ఈ సందర్భంగా మదన్‌గౌడ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏడుకొండలు, కార్మిక నాయకులు కె. సుభాష్, కె. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి చెక్కు అందజేస్తున్న ముద్దాపురం మదన్‌గౌడ్



మజ్జిగ పంపిణీ

కుత్బుల్లాపూర్: చింతల్ పాస్టర్స్, క్రిస్టియన్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో పద్మానగర్ ఫేజ్–2లో ఏర్పాటు చేసిన కేంద్రంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాల్మాన్ హాజరై మజ్జిగ పంపిణీ చేపట్టారు. పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు సంజీవ్ కుమార్, డేవిడ్ ఏసురత్న, సుధాకర్, జెస్సీ, క్రీస్తు దాసు, స్టీఫెన్, సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.